సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 12 । అక్టోబర్ । 2025

యువత.. ఫిట్‌నెస్ మంత్ర

సండే స్పెషల్

పట్టణాలు, పల్లెల్లో సైతం సిక్స్‌ప్యాక్ కోసం యువకులు ఉవ్విళ్లూరుతున్నారు. మారిన ట్రెండ్‌కు అనుగుణంగా కండలు పెంచడానికి ఇష్టపడుతున్నారు. సినిమా హీరోలు, క్రీడాకారులను నేటి యువత అనుకరిస్సున్నారు. శరీరాన్ని ఫిట్‌నెస్‌గా ఉంచడానికి యువత జిమ్‌లో సాధన చేస్తుండటంపై ఈ వారం సండే కథనం. 8లో - దుబ్బాక/దుబ్బాకటౌన్ :



న్యూస్‌రీల్

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

మహంకాళి దేవాలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శనివారం మహంకాళి అమ్మవారి దేవాలయం వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. దేవాలయం ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు.

ప్రతీ తరగతికి టీచర్‌ను నియమించాలి

యూటీఎఫ్ నాయకుల డిమాండ్



సమావేశమైన యూటీఎఫ్ నాయకులు

జహీరాబాద్: ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. జహీరాబాద్‌లోని శ్రామిక భవన్‌లో శనివారం యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలను బతికించుకుని దేశంలో పేద పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి విద్యా కమిషన్ వేసి సలహాలు తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. యూటీఎఫ్ అగ్రనేత నాగటి నారాయణ తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు.

గిరిజన భాష నటుడు కేపీకి పితృ వియోగం

పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



నటుడు కేపీ చవాన్‌ను పరామర్శిస్తున్న తన్వీర్, రాములునేత తదితరులు

జహీరాబాద్ టౌన్: మండలంలోని గమ్యానాయక్ తండాకు చెందిన గిరిజన భాష నటుడు కేపీ చవాన్ తండ్రి గిరియా నాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. కేపీ చవాన్ బంజారా భాషలో పలు చిత్రాల్లో నటించి దర్శకత్వం వహించారు. తండ్రి గిరియా నాయక్ కూడా కొడుకును హీరోగా పెట్టి సినిమా తీశారు. కాంగ్రెస్ నాయకులు మాజీ కార్పొరేషన్ చైర్మన్ తన్వీర్, జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాములు నేత,మాజీ కౌన్సిలర్ మోతిరాం రాథోడ్ తదితరులు తండాకు వెళ్లి నటుడు కేపీ చవాన్‌ను పరామర్శించారు.

కందకం రోడ్డు పనులు పూర్తి చేయాలి

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సమీక్షలో జగ్గారెడ్డి, నిర్మలారెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): కందకం రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆ రోడ్డును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయిస్తానని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఈ రోడ్డు పూర్తయితే పట్టణ రూపురేఖలు మారుతాయని చెప్పారు. పట్టణంలోని కందకం రోడ్డుపై ఆర్ అండ్‌బీ, మున్సిపల్ అధికారులతో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, జగ్గారెడ్డి దంపతులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ...తాను 2014లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మున్సిపల్ శాఖ మంత్రి మహీధర్‌రెడ్డి చొరవతో కందకం రోడ్డు నిర్మాణానికి రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయించానన్నారు. ఈ 11 ఏళ్లలో రూ.15కోట్లు ఖర్చు చేసి ఇప్పటివరకు ఈ రోడ్డును ఎందుకు పూర్తి చేయలేకపోయారని అధికారులను నిలదీశారు.

శాంతించిన మంజీరా

శివ్వంపేట బ్రిడ్జి వద్ద వరద తగ్గటంతో ఆనవాళ్లు కోల్పోయి కనిపిస్తున్న పంట పొలాలు



వరద నీరు తగ్గటంతో తేలిన పొలాలు





పదిరోజుల క్రితం శివ్వంపేట బ్రిడ్జివద్ద గత ఉధృతంగా పారుతున్న మంజీరా నది

జిల్లాలో ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురవటంతో ప్రాజెక్టులన్నీ కళకళలాడుతున్నాయి. జలాశాయాలన్నింటికీ అంచనాలకు మించి వరద పోటెత్తింది. సింగూరు ప్రాజెక్టు పరిసర ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో అతిభారీ వర్షాలు పడటంతో సింగూరు నుంచి మంజీరాకు, మంజీరా నుంచి దిగువకు వచ్చిన నీరు వచ్చినట్టు కిందికి వదిలేశారు. పదిరోజుల క్రితం సింగూరు డ్యామ్ 11 గేట్లు తెరిచి నీళ్లు వదలటంతో గతంలో ఎన్నడూ లేని విధంగా శివ్వంపేట బ్రిడ్జి వద్ద మంజీరా నది ఉధృతంగా పారింది. పాతికేళ్లలో ఎప్పుడూ ఇలా ఏరు పారలేదని, తమ పంటలన్నీ ఆనవాళ్లు లేకుండా నీళ్లలో కొట్టుకుపోయాయని రైతులు తెలిపారు. ప్రస్తుతం ఎగువ నుంచి వరద ప్రవాహం తగ్గటంతో శివ్వంపేట బ్రిడ్జి వద్ద మంజీరా నది శాంతించింది.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



పది రోజుల క్రితం నీళ్లలో పంట పొలాలు



ఖాళీ బిందెలతో నిరసన చేస్తున్న మహిళలు

నీళ్లివ్వండి సారూ..

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీ 15 రోజులుగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొనడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీ మహిళలు పెద్ద ఎత్తున ఖాళీ బిందెలతో రహదారిపై శనివారం ఆందోళనకు దిగారు. కాలనీలోని ప్రతీ ఇంటికి కేవలం మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేసినప్పుడు కనెక్షన్ ఇచ్చారని, పట్టణంలోని వాటర్ ట్యాంక్ కనెక్షన్ ఇవ్వకపోవడమే నీటి ఎద్దడికి ప్రధాన కారణమని వివరించారు. అధికారులు నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని కోరారు.

డీసీసీ పీఠం దక్కేదెవరికో?

నిర్మలారెడ్డినే మరోసారి కొనసాగిస్తారా!

- కొత్తవారికైతే ఉజ్వల్‌రెడ్డికి అవకాశం!
- దరఖాస్తులను ఆహ్వానించిన అధిష్టానం
- దరఖాస్తు యోచనలో పలువురు నాయకులు
- నేడు పార్టీ కీలక సమావేశానికి ఏఐసీసీ, పీసీసీ పరిశీలకులు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందనే అంశంపై నేడు స్పష్టత రానుంది. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షురాలిగా ఉన్న నిర్మలారెడ్డినే మరోమారు కొనసాగిస్తారా? లేదా ఈ పదవిలో కొత్త వారిని నియమిస్తారా? అనే చర్చ ఆ పార్టీ వర్గాల్లో అంతర్గతంగా జరుగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేకు పడటంతో అధినాయకత్వం పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు డీసీసీ అధ్యక్షులతో పాటు, జిల్లా కార్యవర్గాన్ని నియమించాలని నిర్ణయించింది. దీంతో ఆదివారం సంగారెడ్డిలో ఆ పార్టీ కీలక సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ సమావేశానికి వివిధ రాష్ట్రాలకు చెందిన ఏఐసీసీ పరిశీలకులు హాజరుకానున్నారు. డీసీసీ పదవిని ఆశిస్తున్న వారు ఈ సమావేశంలో దరఖాస్తు చేసుకోవాలని పార్టీ నాయకత్వం శ్రేణులకు సూచించింది. దీంతో ఆసక్తి ఉన్న నాయకులు దరఖాస్తులు చేసుకునే అవకాశాలున్నాయి. పార్టీ అధినాయకత్వం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎవరిని నియమించాలనే ముఖ్యనేతలు, పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయాలను సేకరించే అవకాశాలున్నాయి.

ఏ వర్గానికి దక్కుతుందో..?

జిల్లాలో కాంగ్రెస్ అగ్రనాయకత్వం రెండు వర్గాలుగా మారింది. సంగారెడ్డి, ఆందోల్ వంటి ఒకటి రెండు చోట్ల మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో ఆ పార్టీ నాయకులు రెండు, మూడు వర్గాలుగా విడిపోయారు. నారాయణఖేడ్‌తోపాటు, పటాన్‌చెరు, జహీరాబాద్‌లలో ఆ పార్టీ ముఖ్యనాయకులు ఎవరికి వారే అన్న చందంగా తయారయ్యారు. ప్రతీ ఎన్నికల సమయంలో ఈ వర్గాలను ఏకతాటి పైకి తేవడం, ఆయా నాయకులను సమన్వయం చేయడం పార్టీ అధినాయకత్వానికి తలకు నొప్పిగా తయారవుతోంది. ఈ క్రమంలోనే ఈ డీసీసీ అధ్యక్ష పదవి ఏ వర్గానికి చెందిన నాయకుడికి దక్కుతుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

ఉజ్వల్‌రెడ్డి వైపు ముఖ్య నేతల మొగ్గు

ఈ పదవిలో నిర్మలారెడ్డినే కొనసాగించాలనే ఎక్కువ మంది నాయకులు అభిప్రాయ పడుతున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల వరకైనా కొనసాగించాలని పలువురు కీలక నాయకులు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఒకవేళ కొత్త వారిని నియమించిన పక్షంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఎవరికి పదవి వరిస్తుందనేది నేడు తేలనుంది. మార్చిన పక్షంలో జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ఉజ్వల్‌రెడ్డి పేరు తెరపైకి వస్తోంది. సామాజిక సమీకరణాలు మినహాయిస్తే...వైద్యుడైన ఉజ్వల్‌రెడ్డికి ఈ పదవినివ్వడం ద్వారా మేధావివర్గానికి అవకాశం ఇచ్చినట్లవుతుందని అంటున్నారు. అలాగే కొత్త యువ నాయకత్వానికి అవకాశం దక్కినట్లవుతుందని ఆయన వర్గీయులు అభిప్రాయపడుతున్నారు. మంత్రి దామోదర రాజనర్సింహతోపాటు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూడా ఉజ్వల్‌రెడ్డి వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. షెట్కార్ వర్గీయులు ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే అధినాయకత్వం అభిప్రాయ సేకరణ చేసే అవకాశాలుంటాయని, లేనిపక్షంలో ఏకగ్రీవంగానే ఈ పదవి నియామకం ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

నూనెగింజల సాగుపై దృష్టి సారించాలి

- జిల్లా వ్యవసాయాధికారి కె.శివప్రసాద్
- ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన ఆవిష్కరణ వీడియో ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

జహీరాబాద్: రైతులు పప్పు దినుసులు, నూనెగింజల పంటలను సాగుచేస్తూ వాటి దిగుబడులను పెంచుకునే విధానంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.శివప్రసాద్ సూచించారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన కార్యక్రమాన్ని శనివారం మండలంలోని దిడిగి గ్రామ శివారులోని డీడీఎస్‌-కేవీకేలో ధన్ ధాన్య కృషి యోజన ఆవిష్కరణ ప్రత్యక్ష ప్రసారాన్ని వీడియో ద్వారా ప్రదర్శించారు. ప్రధాని మోదీ ప్రసంగం ముగిశాక కేవీకే శాస్త్రవేత్త వరప్రసాద్ తెలుగు అనువాదాన్ని రైతులకు వినిపించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ... ఇటీవల గ్లోబల్ పరిస్థితుల కారణంగా పప్పులు, నూనెగింజల దిగుమతుల్లో అంతరాయం ఏర్పడిందన్నారు. స్వదేశీ ఉత్పత్తుల ద్వారానే ఆత్మనిర్భర్ భారత్ సాధ్యమవుతుందని చెప్పారు. అందుకే ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో పప్పు ధాన్యాల ఉత్పత్తి పెంపుకు పెద్ద పీట వేస్తోందన్నారు. ఈ సందర్భంగా కుసుమ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ భిక్షపతి, మండల వ్యవసాయాధికారులు లావణ్య, వెంకటేశ్వర్లు, నవీన్, అస్సరుద్దీన్, వినోద్‌కుమార్, శాస్త్రవేత్తలు వరప్రసాద్, సాయి ప్రియాంక, అగ్రామనిస్ట్ రమేష్, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీలో..

జహీరాబాద్ పట్టణంలోని సుభాష్‌గంజ్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షించేందుకు వీడియో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి చంద్రశేఖర్, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

నేడు పల్స్ పోలియో

- స్పెషల్ డ్రైవ్‌లో జిల్లా ఎంపిక
- మూడు రోజులపాటు చుక్కల పంపిణీ



సంగారెడ్డి జోన్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ దేశ వ్యాప్తంగా పలు జిల్లాలను ఈ ప్రత్యేక కార్యక్రమం కోసం ఎంపిక చేసింది. ఇందులోభాగంగా పల్స్ పోలియో స్పెషల్ డ్రైవ్‌కు సంగారెడ్డి జిల్లా ఎంపికైంది. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కలెక్టర్ పి.ప్రావీణ్య అధ్యక్షతన ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

1,91,668 మంది చిన్నారులకు పంపిణీ

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జిల్లాలో 1,91,668 చిన్నారులకు పోలియో చుక్కల మందు పంపిణీ చేయనున్నారు. నవజాత శిశువుల నుంచి ఐదేళ్ల వయస్సు వరకు ఉన్న ప్రతి చిన్నారికి టీకా అందేలా చర్యలు చేపట్టారు. మూడు రోజులపాటు పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు కావలసిన అన్ని రకాల ఏర్పాట్లను వైద్యశాఖ ఆధ్వర్యంలో పూర్తి చేశారు. మొదటిరోజు ప్రధాన చౌరస్తాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్, గ్రామపంచాయతీ తదితర ప్రధాన ప్రదేశాలను గుర్తించి బూత్‌ల వారీగా పంపిణీ చేశారు. మిగతా రెండు రోజుల్లో ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తారు.

4,548 మంది సిబ్బంది

పల్ పోలియో కార్యక్రమానికి జిల్లాలో 4,548 మంది సిబ్బందిని కేటాయించారు. ఇందులో వైద్య ఆరోగ్యశాఖ 1,583, అంగన్‌వాడీ 1,505, ఆశా వర్కర్లు 904 మంది సిబ్బందితోపాటు ఇతర వాలంటీర్లను 906 మందిని నియమించారు. వీరితో పాటు 8 మంది ప్రోగ్రాం అధికారులను నియమించి, పర్యవేక్షణ జరుపనున్నారు. రోజు వారీగా పంపిణీ చేసిన వివరాలను ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు.

ఎమ్మెల్యే గూడెంకు భారీ ఊరట

ఆధారాల్లేవంటూ కాటా శ్రీనివాస్‌గౌడ్ పిటిషన్ హైకోర్టు కొట్టివేత

పటాన్‌చెరు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఎన్నికల నామినేషన్ 2023కు సంబంధించి అఫిడవిట్‌లో తప్పుడు ఆదాయ వివరాలు సమర్పించడంతో పాటు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఆయన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాటా శ్రీనివాస్ గౌడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల్లో అవినీతి కార్యకలాపాలు చేపట్టి ఓటర్లను ప్రభావితం చేసి గెలుపొందారని ఆయన శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ కాటా శ్రీనివాస్‌గౌడ్ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు..వ్యాజ్యంలోపేర్కొన్న అంశాలకు సంబంధించి తగిన ఆధారాలను సమర్పించడంలో పిటిషనర్ విఫలమయ్యారని పేర్కొంటూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి క్లీన్ చిట్ ఇస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

అసలేం జరిగింది?

- గిరిజన మహిళ హత్యాచారంపై పోలీసుల దర్యాప్తు ముమ్మరం
- సంచలనం రేపిన కొల్చారం ఘటన



మెదక్ జిల్లా ఆస్పత్రిలో మహిళను పరిశీలిస్తున్న పోలీసులు

మెదక్‌జోన్: జిల్లాలో సంచలనం రేపిన గిరిజన మహిళ హత్యాచారం ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మృతురాలి వద్ద సెల్‌ఫోన్ లేకపోవడంతో అసలేం జరిగిందనే దానిపై క్షుణ్ణంగా ఆరా తీస్తున్నారు. శుక్రవారం ఉదయం ఎప్పటిలాగే మహిళ పని కోసం టిఫిన్ కట్టుకుని సమీప బంధువు (మహిళ)తో కలిసి మెదక్ అడ్డా వద్దకు ఇంటి నుంచి ఆటోలో బయల్దేరింది. ఆ తర్వాత ఎక్కడకు వెళ్లింది? ఎవరిని కలిసింది? అనే విషయాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ శనివారం తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలిని పరిశీలించి క్లూస్‌టీంను రంగంలోకి దింపారు. ఆటోడ్రైవర్‌తో పాటు బాధితురాలితో వచ్చి న మరో మహిళను విచారించినట్లు తెలుస్తోంది. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు మంబోజిపల్లి చౌరస్తాలో ఎన్ని ఆటోలున్నాయనే విష యాన్ని తెలుసుకునేందుకు అక్కడ సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. బాధితురాలి భర్తతో పాటు ఆ తండాలోని పలువురిని సైతం విచారించారు. అయితే సదరు మహిళ మంబోజిపల్లికి రాగానే తనకు ఇక్కడే పని ఉందని ఆటో దిగిపోగా, ఆమె బంధువు ఓ మేస్త్రీ వద్ద పనికి వెళ్లినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పని కల్పిస్తామని ఇద్దరు వ్యక్తులు ఆ మహిళను కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి, ఏడుపాయల దేవస్థానం సమీపంలోని ఓ వెంచర్ వద్దకు తీసుకెళ్లినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ క్రమంలో ఆమెపై అత్యాచారం చేయబోగా సదరు మహిళ ప్రతిఘటించటంతో చీరతో చేతులు కట్టేసి అత్యాచారానికి ఒడిగట్టారు. ఆమె బతికుంటే విషయం బయట పడుతుందని ఆమెపై దాడి చేశారు. చనిపోయిందని భావించిన దుండగులు అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. ఉదయం అపస్మారక స్థితిలో ఉన్న మహిళను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా మెదక్ జిల్లా ఆస్ప త్రికి తరలించారు. కాగా ఈ ఉదంతంలో ఇద్దరు, ముగ్గురు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కాగా, మెదక్ మండలం జానకంపల్లి పంచాయతీ పరిధిలోని సంగాయిగూడ తండాకు చెందిన ఈ మహిళకు ఐదుగురు సంతానం. అందులో పెద్ద కుమార్తె పెళ్లి చేయగా, మిగతా నలుగురు పిల్లలను రెక్కల కష్టం మీద పోషిస్తున్నారు. దంపతులిద్దరూ అడ్డా కూలీలుగా పనిచేస్తుంటారు.

సర్కారు బడుల్లో అల్పాహారం

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు

- చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- జిల్లాలో 1,08,293మంది విద్యార్థులకు ప్రయోజనం
- ఇప్పటికే కొనసాగుతున్న రాగిజావ పంపిణీ

పాఠశాలలు	సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక పాఠశాలలు	863	55,577
ప్రాథమికోన్నత పాఠశాలలు	191	38,821
ఉన్నత పాఠశాలలు	211	13,895



భోజనం చేస్తున్న విద్యార్థులు

నారాయణఖేడ్: పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు వారికి ఉదయం పూట అల్పాహారం అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రానున్న విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి పాఠశాలల విద్యార్థులందరికీ అల్పాహారం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఈ పథకం జిల్లాలోని నియోజకవర్గానికి రెండు పాఠశాలల చొప్పున అక్కడక్కడా ప్రారంభించాక శాసనసభ ఎన్నికలు రావడం, అనంతరం ప్రభుత్వం మారడంతో అల్పాహారం కొనసాగలేదు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు అల్పాహారం అందించాలని తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గతంలో చెన్నైలో ఓ కార్యక్రమం నిమిత్తం వెళ్లిన సీఎం తమిళనాడు రాష్ట్రంలో అమలు చేస్తున్న తరహాలో రాష్ట్రంలోనూ అమలు చేయాలని గతంలోనే వెల్లడించారు. సీఎం ఆదేశాల మేరకు అధికారులు అందుకు సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించడంతో రానున్న విద్యా సంవత్సరం నుంచి పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ పథకం అమలైతే జిల్లాలో 1,08,293మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

పథకం అమలుపై కసరత్తు

పథకాన్ని ఎలా అమలు చేయాలి? అల్పాహారంగా ఏమేమి అందించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట కార్మికుల ద్వారా వీటిని వండించి అందించాలని ఆలోచిస్తున్నారు. అల్పాహారంగా విద్యార్థులకు రైస్‌కు సంబంధించిన వంటకాలు పొంగలి, కిచిడీ, పులిహోరా, వెజ్ బిర్యానీ తరహాగా, మరో రెండు రోజులు ఉప్మా, ఇంకో రెండు రోజులు ఇడ్లీ/ బోండా లాంటివి అందించాలన్న ఆలోచన చేస్తున్నారు. మూడు రోజులపాటు రైస్‌తో కూడుకున్న అల్పాహారం, మరో రెండు రోజులు ఇతర అల్పాహారం అందించాలని యోచిస్తున్నారు. విద్యార్థుల అల్పాహారంకు అయ్యే వ్యయంలో కొంత శాతం కేంద్రం పీఎంశ్రీ పథకం ద్వారా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరనుంది. కేంద్రం తన వాటా నిధులు చెల్లించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో భరించి అల్పాహారం అందించాలన్న కృతనిశ్చయంతో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

సగటున రూ.10 నుంచి రూ.15 వరకు

ప్రస్తుతం అల్పాహారంకు ఒక్కో విద్యార్థికి 1 నుంచి 5వ తరగతివరకు రూ.8, 6 నుంచి 10వ తరగతి వరకు రూ.12 చొప్పున ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సగటున ఒక్కో విద్యార్థికి రూ.10 నుంచి రూ.15వరకు ఖర్చు చేసి పథకాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే కార్మికులద్వారానే అల్పాహారం వండించాలని, ఇందుకుగాను వారికి నెలకు రూ.500 చొప్పున పారితోషికం అదనంగా చెల్లించాలని అధికారులు ఆలోచిస్తున్నారు. పాఠశాలలకు వంటగ్యాస్ సిలిండర్ల కనెక్షన్లు సమకూర్చాలని కూడా విద్యాశాఖ ప్రతిపాదించింది. ఒక్కో కనెక్షన్‌కు రూ.రెండు వేలపైగా డిపాజిట్ చేయాల్సి ఉండగా ఈ మొత్తాన్ని ప్రభుత్వమే సమకూర్చాలని నివేదించింది. గ్యాస్ కొనుగోలు ధరను మాత్రం వంటగ్యాస్ ఏజెన్సీలు భరించాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారంగా రాగి జావను అందిస్తోంది.

మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు



పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందించాలని ప్రభుత్వం నుంచి వచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు చేపడతాం. ఇంకా అందుకు సంబంధించిన మార్గదర్శకాలు రావాల్సి ఉంది. పథకం అమలుతో విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– వెంకటేశ్వర్లు, డీఈవో, సంగారెడ్డి

క్లుప్తంగా

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం


ప్రియ

పటాన్‌చెరు టౌన్: తండ్రి మందలించడంతో కూతురు అదృశ్యమైంది. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కరెంట్ ఆఫీస్ సమీపంలో ఉండే లక్ష్మి కూతురు ప్రియ (19) ఇస్నాపూర్‌లో ఓ బట్టల షాపులో పనిచేస్తుంది. ఈ క్రమంలో ఈనెల 8న ఉదయం ప్రియ ఫోన్‌లో మాట్లాడుతుండటంతో తండ్రి మందలించాడు. దీంతో ఎవరికి చెప్పకుండా అదే రోజు రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు.

కాశీంపూర్‌లో యువకుడు


సుభాష్

జహీరాబాద్: మండలంలోని కాశీంపూర్ గ్రామానికి చెందిన సుభాష్ (28) అదృశ్యమయ్యాడు. చిరాగ్‌పల్లి పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 4న ఉదయం ఇంటి నుంచి వెళ్లిన అతడు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తండ్రి నర్సింహులు పోలీసులుకు ఫిర్యాదు చేశారు.

చెరువులో మృతదేహం లభ్యం



సంగారెడ్డి క్రైమ్: చెరువులో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ వివరాల ప్రకారం... పట్టణంలోని స్థానిక మహబూబ్‌సాగర్ చెరువులో గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని శనివారం ఉదయ స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందిచారు. వెంటనే ఘటన స్థలానికి చెరుకొని మృతదేహన్ని బయటకు తీశారు. చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి మృతి చెందాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆభరణాలు అపహరించిన నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పుల్‌కల్(అందోల్)/జోగిపేట: మహిళకు బైక్‌పై లిఫ్టు ఇచ్చి ఆభరణాలు అపహరించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. జోగిపేట సీఐ అనిల్‌కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి పట్టణానికి చెందిన మంగళి సత్యమ్మ(58)శుక్రవారం సదాశివపేటలోని తనసోదరి వద్దకు బయలు దేరింది. మార్గమధ్యలో చిలిప్‌చెడ్ మండలం బంజారనగర్‌కు చెందిన రమావత్ బన్సీలాల్ (బన్సీ) ఎదురై సత్యమ్మతో మాటలు కలిపి, మీ చెల్లి ఇంటి వద్ద దింపుతానని నమ్మించాడు. పల్సర్ బైక్‌పై ఆమెను ఎక్కించుకుని పుల్‌కల్ మండలం గొంగులూరు శివారుకు వచ్చాడు. అక్కడ మైసమ్మ గుడివద్దకు రాగానే బైక్ ఆపి మహిళపై దాడి చేసి బంగారు కమ్మలు, వెండి కాళ్ల కడియాలు లాక్కున్నాడు. ఆమె అరవడంతో దూరంగా ఉన్న వ్యక్తి పరిగెత్తుకు రావడంతో పరారయ్యాడు. పుల్‌కల్ ఎస్‌ఐ విశ్వజన్ నేతృత్వంలో ఆభరణాలను రికవరీ చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

కల్హేర్(నారాయణఖేడ్): పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. సిర్గాపూర్ ఎస్‌ఐ మహేశ్ వివరాల ప్రకారం... సిర్గాపూర్ మండలం అంతర్‌గాం తండాలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న కొంతమందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 3,250, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

దొంగ అరెస్టు

సిద్దిపేటకమాన్: దొంగతనానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం... జనగామ జిల్లా నర్మెటకు చెందిన శివరాత్రి ఈశ్వర్ పట్టణంలోని మిలాన్ గార్డెన్ సమీపంలో నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం అర్ధరాత్రి దొంగతనానికి పాల్పడ్డాడు. స్థానికులు దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

WANTED

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడీవార్డెన్స్, లేడీ కేర్‌టేకర్స్/నర్సులు, కాంపౌండర్స్, వాచ్‌మేన్స్, సెక్యూరిటీ గార్డ్స్, భార్యాభర్తలు కావలెను. 8985114453, 9391036931 [HA-16191]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

యువత.. ఫిట్‌నెస్ మంత్ర


సిక్స్‌ప్యాక్‌తో యువకులు

నిత్యం ఉత్సాహంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి. మారిన ట్రెండ్‌కు అనుగుణంగా యువత ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇనుప ఖండరాలు, ఉక్కు నరాలు ఉన్న యువత దేశానికి అవసరమంటూ స్వామి వివేకానంద చెప్పిన మాటలు స్ఫూర్తిగా తీసుకున్నారో లేక నయా బాడీ ట్రెండో చెప్పలేం కాని యువకులు జిమ్‌ల వైపు పరుగులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో యువత ఫిట్‌నెస్‌పై ఈ వారం కథనం.

– దుబ్బాక/దుబ్బాకటౌన్ :

నయా ట్రెండ్

- సిక్స్‌ప్యాక్‌పై ఆసక్తి
- ఆరోగ్యానికి ప్రాధాన్యం
- శరీరాకృతి కోసం కసరత్తు
- సెలబ్రిటీలను అనుసరిస్తున్న యువకులు
- ఉమ్మడి జిల్లాలో వందల సంఖ్యలో జిమ్‌లు

ఉమ్మడి మెదక్ జిల్లాలోని ముఖ్యపట్టణాల్లో జిమ్ కల్చర్ బాగా పెరిగింది. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల, సంగారెడ్డి, పటాన్‌చెరు, రామచంద్రాపురం, జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్, సదాశివపేట, నర్సాపూర్, మెదక్, రామాయంపేట, తూప్రాన్, చేగుంట, జిన్నారం పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాల్లో వందల సంఖ్యలో జిమ్‌లు వెలిశాయి. జిమ్‌లలో లేటెస్ట్ ఎక్విప్‌మెంట్‌తో యువకులు ఆరు పలకల శరీరాన్ని పొందడానికి తాపత్రయ పడుతున్నారు. వీటిలో తర్ఫీదు పొందిన శిక్షకులు యువకులకు సూచనలు ఇస్తుండగా.. శరీరాకృతి కోసం సాధన చేస్తున్నారు. గతంలో ఫోర్ ప్యాక్ బాడీని ఇష్టపడిన యువత ఇప్పుడు సెలబ్రిటీలు పొందుతున్న సిక్స్‌ప్యాక్‌ను ఫాలో అవుతున్నారు. దీని కోసం వ్యాయామశాలలో చెమట చిందిస్తూ.. ఆరోగ్యం కోసం శ్రమిస్తున్నారు.

శిక్షకుల సూచనల మేరకు..

ఉదయం, సాయంత్రం వేళలో జిమ్‌లలో శిక్షకుల సూచనల మేరకు సాధన చేస్తున్నారు. మారుతున్న నేటి సమాజంలో మధ్య వయస్సు వారు సైతం బీపీ, షుగర్ బారిన పడుతున్నారు. దీంతో వారు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా ఉదయం వాకింగ్ చేయడంతో పాటు జిమ్‌లలో వర్కౌట్లు చేస్తూ ఆరోగ్యంగా ఉంటున్నారు.


జిమ్‌లో సాధన చేస్తున్న యువకులు

అందుబాటులో అధునాతన పరికరాలు

వ్యాయామశాలలకు వచ్చే వారికి లేటెస్ట్ సాధన పరికరాలు ఉన్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ట్రెడ్‌మిల్, బాడీ పుషప్స్, బెంచ్‌ప్రెస్, ల్యాట్స్ పుల్లప్స్, కేబుల్ క్రాస్‌ఓవర్, డబుల్ బార్, వైబ్రేటింగ్ బెల్ట్, ఒలింపిక్ బార్, లెగ్ కర్ల్, ప్రెస్, స్పిన్ సైకిల్ వంటి పరికరాలను అందుబాటులో ఉంచారు. మ్యాన్‌వల్‌గా సాధన చేసే డంబెల్స్, వెయిట్ లిఫ్ట్స్ కూడా ఉన్నాయి. వీటితో వర్కౌట్ చేస్తున్న యువత శిక్షకుల సూచనలు పాటిస్తూ నిత్యం సాధన చేస్తున్నారు. వందలాది మంది యువకులు నిత్యం జిమ్‌లకు వెళ్తూ ఆరోగ్యంతో పాటు శరీరాకృతి పొందుతున్నారు.


జిమ్‌లో అధునాతన పరికరాలు

స్లిమ్‌గా అయ్యేందుకు..

నేటి కాలంలో యువకులు తినే జంక్ ఫుడ్ వల్ల శరీరంలో విపరీతంగా కొవ్వు పెరుగుతుంది. దీనిని తగ్గించుకోవడానికి జిమ్‌లలో అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ట్రెడ్‌మిల్, సైక్లింగ్, బై సైకిల్ వంటి పరికరాలతో సాధన చేస్తున్నారు.

ఆసక్తి పెరిగింది



నేటి యువకులకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. గత పదేళ్లుగా వివిధ జిమ్‌లలో యువకులకు శిక్షణనిస్తున్నా. కాలానుగుణంగా పరికరాలు సైతం మార్పు చెందుతూ వస్తున్నాయి. ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. చెడు వ్యసనాల వల్ల కలిగే అనారోగ్య సమస్యలను వివరిస్తూ శిక్షణనిస్తున్నాం.

– గౌస్, శిక్షకుడు, దుబ్బాక

సాధనతోనే సిక్స్‌ప్యాక్



రెండేళ్లకు పైగా సిక్స్ ప్యాక్ కోసం కఠోర సాధన చేస్తే ఇప్పుడు బాడీ వచ్చింది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం జిమ్‌లో క్రమం తప్పకుండా సాధన చేస్తున్నా. ఇంకా బాడీ పెంచేందుకు కృషి చేస్తా. జిమ్‌లలో అధునాతన పరికరాలు, సౌకర్యాలు బాగు ఉన్నాయి.

– మచ్చ భగత్

మంచి పరిణామం



యువత డ్రగ్స్, మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్స్ జోలికి పోకుండా భవిష్యత్తు కోసం ఆలోచించాలి. ప్రతిరోజు జిమ్‌లకు వెళ్లడం మంచి పరిణామం. ఎక్సర్‌సైజ్ చేయడం అలవాటు చేసుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుంది. సాధన చేస్తూ మంచి ఆహారం తీసుకుంటే అనారోగ్యాలకు గురికాకుండా ఆరోగ్యవంతులుగా ఉండవచ్చు.

– డాక్టర్ హేమరాజ్‌సింగ్,ప్రముఖ సర్జన్

మద్యానికి బానిసై.. జీవితంపై విరక్తి చెంది..

వ్యక్తి ఆత్మహత్య


బాలరాజు

వట్‌పల్లి(అందోల్): ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అందోలు మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... చింతకుంట గ్రామానికి చెందిన బాలరాజు(23) తండ్రి చనిపోగా తల్లి వద్దే ఉంటున్నాడు. ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతున్న అతడు కనిపించకుండా పోయి పది రోజులు కావస్తుంది. కొలు రైతు శనివారం ఉదయం చెట్టుకు కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం వేలాడుతూ ఉండడాన్ని చూసి జోగిపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ పాండు తన సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. కాగా ఘటనా స్థలంలో ద్విచక్రవాహనాన్ని చూసి బాలరాజు మృతదేహంగా గుర్తించారు. మృతుడు మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఉరేసుకున్నట్లు భావిస్తున్నారు.

మనస్తాపంతో భర్త..

మునిపల్లి(అందోల్): భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ వివరాల ప్రకారం... మండలంలోని మేళసంగ్యం గ్రామానికి చెందిన బేగరి బాలయ్య (47), భారతమ్మ దంపతులు కూలీ పని చేస్తూ జీవిస్తున్నారు. బాలయ్య తరచూ మద్యం తాగి భార్యతో గొడవపడేవాడు. కాగా ఈ నెల 7న భార్యతో బాలయ్య మద్యం తాగడానికి డబ్బులు కావాలని గొడవపడ్డాడు. ఈ క్రమంలో భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన అతడు రెండు రోజుల క్రితం ఇంట్లోని బాత్ రూంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు పోలీసులకు, భార్య భారతమ్మకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసే సరికి బాలయ్య విగతజీవిగా పడి ఉన్నాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..


అనిల్‌గౌడ్

జహీరాబాద్ టౌన్: వైన్స్ పర్మిట్ రూం వద్ద వ్యక్తి అనుమానాస్పద స్థితిలో శనివారం రాత్రి మృతి చెందాడు. పట్టణ సమీపంలోని భరత్‌నగర్‌కు చెందిన సంగెం అనిల్‌గౌడ్(37) మేస్త్రీ పనులు చేస్తున్నాడు. మద్యం తాగే అలవాటు ఉన్న అనిల్‌గౌడ్ శుక్రవారం ఇంటి నుంచి వెళ్లాడు. పట్టణంలోని ఓ వైన్స్ పర్మిట్ రూం వద్ద పడి ఉన్నాడు. ఆయన నుదిటిపై గాయాలు ఉన్నాయి. స్థానికులు గమనించి ఆయనను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. భర్త మృతి పట్ల భార్య సరిత అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇద్దరిపై పోక్సో కేసు

ములుగు(గజ్వేల్): యువతిపై లైంగిక దాడి చేసిన ఘటనలో ఇరువురిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం... మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతికి కుటుంబీకులు సెప్టెంబర్ 25న పెద్దల సమక్షంలో వివాహం చేశారు. వివాహం అనంతరం ఆ యువతి అత్తింటి వద్దే ఉంటుంది. మూడు రోజులుగా ఆ యువతికి కడుపులో నొప్పి వస్తుండటంతో తల్లి, కూతురు ఇంటికి వెళ్లింది. అనుమానంతో గర్భనిర్ధారణ పరీక్ష చేయించడంతో గర్భం దాల్చినట్లు తేలింది. దీంతో తల్లి వివాహం జరిగి 13 రోజులకే ఈ పరిస్థితి ఏమిటని కూతురుని ప్రశ్నించింది. ఆ యువతి సంవత్సర కాలంగా గ్రామానికి చెందిన ఉదయ్‌కిరణ్ తనను ప్రేమిస్తున్నాడని, వివాహం చేసుకుంటానని లొంగదీసుకున్నాడని తెలిపింది. దీంతో 7 నెలల గర్భం దాల్చానని చెప్పింది. ఇదే అలుసుగా తీసుకుని అదే గ్రామానికి చెందిన పవన్‌కల్యాణ్ అనే యువకుడు తనను బెదిరించి లొంగదీసుకున్నాడని ఆ యువతి పేర్కొంది. ఈ విషయమై తల్లితో పాటు కుటుంబీకులు ఆ ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: కంటైనర్ కారును ఢీకొట్టిన ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కర్ణాటక గుల్బర్గా నుంచి మెహదీపట్నంకు ఓ కుటుంబం కారులో వస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కర్దనూర్ సమీపంలో కొల్లూరు వైపు వెళ్తున్న కంటైనర్ కారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ఐదుగురు పెద్దలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఆసిఫ్, అబ్దుల్ బషీర్ బేగం, ఆయేషా, జబ్బిన్ బేగం, ముదా షేర్, రహమతున్నీసాకు తీవ్ర గాయాలయ్యాయి. మరో చిన్నారి క్షేమంగా ప్రమాదం నుంచి బయటపడింది. వెంటనే ఔటర్ అంబులెన్స్ క్షతగాత్రులను హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు.


ఘటనా స్థలం వద్ద నుజ్జు నుజ్జైన కారు

సులభంగా గణితం బోధించాలి

టీఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులకు గణితం సులభంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని తెలంగాణ గణిత ఫోరం(టీఎంఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్ అన్నారు. టీఎంఎఫ్ సిద్దిపేట జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ... గణితంలో రాణించిన విద్యార్థి మిగిలిన అన్ని సబ్జెక్టులలో ప్రతిభ కనబరుస్తారన్నారు. కార్యక్రమంలో టీఎంఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు అశోక్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అజయ్ కుమార్ రెడ్డి, జిల్లా శాఖ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి వెంకటేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు మనోహర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఎండీడీకేవై పథకంతో రైతులకు మేలు

హాజరైన అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు


కార్యక్రమాన్ని వీక్షిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు

కౌడిపల్లి(నర్సాపూర్): పీఎండీడీకేవై పథకంతో రైతులకు మేలు చేకూరనుందని అధికారులు పేర్కొన్నారు. శనివారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నూతనంగా ప్రారంభించిన పీఎండీడీకేవై పథకం కార్యక్రమాన్ని మండలంలోని తునికి కేవీకేలో ఆన్‌లైన్‌లో అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా డీఏఓ దేవ్‌కుమార్ మాట్లాడుతూ... ఈ పథకంతో పీఎం దేశంలోని రైతులు, వ్యవసాయ అభివృద్ధికి రూ.42వేల కోట్ల కేటాయించారని చెప్పారు. అనంతరం రైతులకు కేవీకేలో సాగుచేస్తున్న సేంద్రియ పంటలు, వర్మీ కంపోస్టును క్షేత్రస్థాయిలో చూపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి, కేవీకే హెడ్‌అండ్ సైంటిస్ట్ డాక్టర్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్, ఉదయ్‌కుమార్, డాక్టర్ భార్గవి, రైతులు పాల్గొన్నారు.

సీపీఆర్ చేసి.. ప్రాణాలు కాపాడి..

పోలీసులను అభినందించిన ఎస్పీ శ్రీనివాసరావు


మహిళను ఆస్పత్రికి తీసుకెళ్తున్న పోలీసు

హవేళీఘణాపూర్(మెదక్): ఆత్మహత్యకు యత్నించిన మహిళను పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలు కాపాడారు. వివరాలు ఇలా... మండలంలోని లింగ్సాన్‌పల్లికి చెందిన జ్యోతి కుటుంబీకులతో గొడవపడి ఇంట్లోకి వెళ్లి తలుపులు పెట్టుకొని ఉరి వేసుకుంది. ఈ విషయాన్ని గ్రామస్తులు 100కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసు సిబ్బంది జయానంద్, వరప్రసాద్, రమేశ్ ఘటనా స్థలానికి చేరుకొని తలుపులు పగులగొట్టి ఇంట్లో కొన ఊపిరితో ఉన్న జ్యోతిని కిందకు దించి సీపీఆర్ చేశారు. వెంటనే పోలీసు వాహనంలో హుటాహుటిన మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

ఆపదలో ఆదుకున్న సీఐ


తిరుపతి రైల్వే స్టేషన్‌లో మెదక్‌కు చెందిన కుటుంబీకులు

మెదక్ మున్సిపాలిటీ: ఓ కుటుంబానికి ఆపదలో ఆపన్నహస్తం అందించి పోలీసు అధికారి మానవత్వం చాటుకున్నాడు. వివరాలు... మెదక్ పట్టణానికి చెందిన ఓ కుటుంబం ఈనెల 10న తిరుపతి దర్శనానికి వెళ్లారు. అయితే అక్కడ ఆ కుటుంబానికి సంబంధించిన వస్తువులు డబ్బులు చోరీకి గురయ్యాయి. దీంతో ఆ కుటుంబం స్వగ్రామం తిరిగివచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఈ విషయం తెలుసుకున్న పట్టణ సీఐ మహేశ్ ఎస్పీ సూచన మేరకు ఆ కుటుంబానికి సురక్షితంగా మెదక్ రావడానికి రూ.4వేల సహాయం చేశారు. కాగా ఆ కుటుంబంలో పెద్ద వారిలో ఒకరు వికలాంగుడు కాగా ఇద్దరు ఆడవాళ్లకు మాటలు రావు. చిన్న బాబుకు మాత్రమే మాటలు వస్తాయి. రైల్వే పోలీస్ సహకారం తీసుకుని వారికి సమయానికి డబ్బులు పంపి వారిని మెదక్‌కి తీసుకొచ్చామని సీఐ తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన కారు

భార్యాభర్తలతో పాటు మరొకరికి గాయాలు


చెట్టును ఢీకొట్టడంతో దెబ్బతిన్న కారు

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలతో పాటు మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని రవీంద్రనగర్ శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... హైదరాబాద్ నుంచి మల్లారెడ్డి, రాజహంస దంపతులతో పాటు మరొకరు ప్రతాప్‌రెడ్డి కరీంనగర్‌కు సొంత కారులో వస్తున్నారు. ఈ క్రమంలో రవీంద్రనగర్ శివారులో రాజీవ్ రహదారిపై అకస్మాత్తుగా గేదె అడ్డు రావడంతో తప్పించబోయి కారు రోడ్డు కిందకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. దీంతో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెడు వ్యసనాలకు బానిసై.. చోరీలు

- సిగరెట్ల చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్
- రూ.18 లక్షల సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ

మెదక్ మున్సిపాలిటీ: ఐటీసీ గోదాం సిగరెట్ బాక్స్‌ల చోరీ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి పది లక్షల సిగరెట్ బాక్స్‌లు, మూడు వాహనాలు, రూ.8లక్షల నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శనివారం మెదక్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు కేసు వివరాలు వెల్లడించారు. మనోహరాబాద్ మండలం జీడిపల్లికి చెందిన మైదరబోయిన శ్రీకాంత్, కోనాయిపల్లి చెందిన జెట్టి మహేశ్ కొన్నేళ్లుగా ఐటీసీ గోదాం డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఇద్దరి మంచి స్నేహితులు. ఈ క్రమంలో చెడు వ్యసనాలకు అలవాటు పడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా గోదాంలోని సిగరెట్ బాక్స్‌లను అపహరించి డబ్బు సంపాదించాలని పథకం రచించారు. ఈ క్రమంలో గోదాంలో ఉన్న భద్రత లోపాలను గమనించి చోరీకి అనుకూలంగా ఉందని అవకాశం కోసం ఎదురు చూశారు. 2024 డిసెంబర్ 08న అర్ధరాత్రి గోడదూకి గోదాంలోకి ప్రవేశించి టాటా ఏస్ వాహనం తాళాలు పగులగొట్టి అందులోని రూ.8లక్షల 30వేల విలువైన సిగరెట్లు దొంగతనం చేసి అమ్ముకున్నారు. తిరిగి ఇదే తరహాలో 2025 మే 18న రూ.15 లక్షల సిగరెట్లు, సెప్టెంబర్ 9న రూ.10లక్షల విలువైన సిగరెట్లు ఎత్తుకెళ్లారు. ఈ మూడు చోరీల్లో సుమారు రూ.33లక్షల విలువైన గల సిగరేట్ బాక్స్‌లను అపహరించి, మహేశ్ వ్యవసాయ భూమిలో దాచిపెట్టి రిటైల్ వ్యాపారులకు అమ్ముతున్నారు. సుమారు రూ.18లక్షల 64వేలు రాగా వాటిని సమానంగా పంచుకున్నారు. కాగా మూడోసారి చోరీ చేసిన సిగరెట్లను అమ్మడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో శనివారం జీడిపల్లి వద్ద పోలీసులు వాహన తనిఖీల్లో పట్టుకున్నారు. ఎస్‌ఐ సుభాష్ గౌడ్ అదుపులోకి విచారించగా చేసిన చోరీలు ఒప్పుకున్నారు. తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ పర్యవేక్షణలో సీఐ రంగకృష్ణ, ఎస్సై సుభాష్‌గౌడ్, సిబ్బంది గోవర్ధన్‌రావు, రాధాకృష్ణ, భిక్షపతి, నరేందర్‌గౌడ్, సురేశ్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.


స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఒంటరిగా వెళ్తున్న వారే టార్గెట్

చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

మెదక్ మున్సిపాలిటీ: ఒంటరిగా వెళ్తున్న వారిని టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు కేసు వివరాలు వెల్లడించారు. పాపన్నపేట మండలం నార్సింగి గ్రామానికి చెందిన నీలగిరి దశరథ్ జగద్గిరిగుట్ట ఆల్విన్ కాలనీలో నివాసం ఉంటూ పెయింటింగ్ పనులు, రేగోడ్ మండలం లింగంపల్లికి చెందిన బుర్నోటి ఆగమయ్య కూకట్‌పల్లిలో నివాసం ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. టేక్మాల్ మండలం కొరంపల్లికి చెందిన ధన్నారం కృష్ణ ఇంటర్ చదువుతున్నాడు. వీరు ముగ్గురు కలిసి ఈనెల 7న సెల్ఫ్‌డ్రైవ్ కారు తీసుకున్నారు. అదే రోజు అర్ధరాత్రి కారులో ప్రయాణిస్తూ నర్సాపూర్ పట్టణంలో స్కూటీపై వెళ్తున్న కొండయ్యను ఆపారు. అతన్ని కొట్టి రూ.350తోపాటు అతని సెల్‌ఫోన్ లాక్కున్నారు. అనంతరం నర్సాపూర్ శివారులో గొర్రెల కాపర్లు అయిన నర్సింహ, రామప్పలను కారులో ఎక్కించుకొని మార్గమధ్యలోకి తీసుకెళ్లి వారి వద్ద ఉన్న రూ.8వేల వరకు నగదు, సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. సాంకేతిక ఆధారాలు ఉపయోగించి నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి స్విఫ్ట్ కారు, సెల్‌ఫోన్లు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, నర్సాపూర్ ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.